సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం, 19, ఆగస్టు, 2025

గరిష్ఠం/కనిష్ఠం
29.2 /20.1

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సోమశిల–శ్రీశైలం లాంచీ ప్రయాణం వాయిదా

కొల్లాపూర్‌ రూరల్‌: ఎగువ కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి వరద పోటెత్తడంతో సోమశిల నుంచి శ్రీశైలం లాంచీ ప్రయాణం వాయిదా వేసినట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణమ్మకు భారీ వస్తుండడంతో శ్రీశైలం జలాశయం 10 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లాంచీ శ్రీశైలం నుంచి సోమశిలకు తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడనున్న కారణంగా.. పర్యాటకుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మరల వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెల 23, శనివారం నుంచి లాంచీ ప్రయాణాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్‌ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరిగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌రఘునాథ్‌ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పోలీస్‌ ప్రజావాణికి మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 5 భూ తగాదా, 2 న్యాయం చేయాలని, 2 భార్యాభర్తల గొడవలు, 3 ఇరువర్గాల మధ్య గొడవపై ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

అందుబాటులో 2,252 మె.టన్నుల యూరియా

కందనూలు: నాగర్‌కర్నూల్‌ జిల్లాలో 2,252 మెట్రిక్‌ టన్నుల యూరియా అందుబాటులో ఉందని డీఏఓ యశ్వంత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో డీఏపీ, కాంప్లెక్స్‌, సూపర్‌ఫాస్ఫేట్‌ ఎరువులు 31,000 మెట్రిక్‌ టన్నులు, యూరియా17,824 మెట్రిక్‌ టన్నులు రైతులకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా మార్క్‌ఫెడ్‌ వారి వద్ద 370 మెట్రిక్‌ టన్నుల బఫర్‌ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవసరమైన మేరకు ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు.

అంగన్‌వాడీల్లోనే ప్రీ ప్రైమరీ విద్య అమలు చేయాలి

కందనూలు: ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్స్‌ యూనియన్‌ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగించడం వల్ల అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని స్పష్టం చేశారు. విద్యా బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించి, వలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అదనంగా అంగన్‌వాడీ టీచర్లకు చెల్లించాలన్నారు.

జల విలయం

పెద్దకొత్తపల్లి మండలంలో అత్యధికంగా 96.4 మి.మీ. వర్షపాతం



పాల్మూర్‌, గుట్టపల్లి గ్రామాల మధ్య చౌకవాగుపై రాకపోకలు నిలిపేస్తున్న సిబ్బంది

- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- పొంగిపొర్లుతున్న వాగుల రహదారులపై రాకపోకలు సాగించొద్దని కలెక్టర్‌ సంతోష్‌, ఎస్పీ వైభవ్‌ గైక్వాడ్‌ విజ్ఞప్తి

సాక్షి, నాగర్‌కర్నూల్‌/నాగర్‌కర్నూల్‌ క్రైం/ బిజినేపల్లి: జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సోమవారం పెద్దకొత్తపల్లి మండలంలో అత్యధికంగా 96.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని లింగాల, బిజినేపల్లి, తాడూరు, బల్మూరు, నాగర్‌కర్నూల్‌, కొల్లాపూర్‌, ఉప్పునుంతల మండలాల్లో 55 మి.మీటర్లకు మించి వర్షం కురిసినట్లు అధికారులు పేర్కొన్నారు. చారకొండ మండలంలో అత్యల్పంగా 25.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పలుచోట్ల చెరువులు మత్తడి దూకుతూ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని సిర్సవాడ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ వాగుతో పాటు జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం మత్తడి ప్రవాహాన్ని కలెక్టర్‌ సంతోష్‌ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాకేంద్రం నుంచి కేసరిసముద్రం మీదుగా ఎండబెట్ల వైపు వెళ్లే వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఉప్పొంగుతున్న వాగులు, చెరువుల ప్రవాహాల మీదుగా దాటేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని కలెక్టర్‌ విజ్ఞప్తి చేశారు.

అధికార యంత్రాంగం హైఅలర్ట్‌

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్ట నివారణకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రధానంగా పోలీస్‌, రెవెన్యూ, మున్సిపల్‌ తదితర శాఖల అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వరదలు, ముంపు ప్రాంతాల బాధితుల సంరక్షణ, సహాయం కోసం ఇప్పటికే ప్రత్యేక కంట్రోల్‌ రూం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ప్రజలు నేరుగా 08540–230201 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

నిలిచిన రాకపోకలు

జిల్లాలో దుందుభీ వాగు ప్రవాహం ఉధృతంగా మారడం, పలుచోట్ల చెరువులు మత్తడి దూకి రహదారుల మీదుగా ఉప్పొంగుతుండటంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఆటకం ఏర్పడుతోంది. జిల్లాకేంద్రంలోని కేసరిసముద్రం చెరువు ఉప్పొంగి నాగర్‌కర్నూల్‌–ఎండబెట్ల రోడ్డు మీదుగా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద దుందుభీ ప్రవాహం ఉధృతం కావడంతో అధికారులు ఈ మార్గంలో వాహనాలను నిలిపివేశారు. ప్రజలు ఎవరూ ఈ మార్గంలో వెళ్లకుండా నిరంతరం పహారా ఏర్పాటుచేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు వాగులు దాటేందుకు ఎవరూ ప్రయత్నించొద్దని ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌రఘునాథ్‌ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువును పరిశీలించి పోలీస్‌ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నది తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రమాదకర స్థితిలో పారుతున్న వాగుల్లో ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని, అలాంటి ప్రాంతాల్లో పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌, సీఐ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కేసరి సముద్రం చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌

పలుచోట్ల కుండపోత

జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పలుచోట్ల కుండపోత వర్షం కురిసింది. దీంతో వరద నీరు పంట పొలాలను ముంచెత్తింది. ఈ నేపథ్యంలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోయారు. జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయంగా మారాయి.

పాత ఇళ్లతో ప్రమాదం

భారీ వర్షాలకు జిల్లాలోని అమ్రాబాద్‌ మండలం జంగిరెడిపల్లిలో మూడు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన మద్దెల అర్జనమ్మ, మంతటి నారమ్మ, కల్వల లక్ష్మమ్మకు చెందిన పాత ఇళ్ల పైకప్పు వర్షానికి తడిసి సోమవారం నేలకూలాయి. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శిథిలమైన, పాత ఇళ్లలో ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.



అమ్రాబాద్‌ మండలం జంగిరెడ్డిపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

సోమవారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు (మి.మీ.)

మండలం	వర్షపాతం
పెద్దకొత్తపల్లి	96.4
లింగాల	84.4
బిజినేపల్లి	72.4
తాడూరు	62
బల్మూరు	56.4
నాగర్‌కర్నూల్‌	56.2
కొల్లాపూర్‌	56.2
ఉప్పునుంతల	55.4
అచ్చంపేట	54.6
పదర	52.6
కల్వకుర్తి	52.4
తిమ్మాజిపేట	52
అమ్రాబాద్‌	51.8
వంగూరు	47.2
తెలకపల్లి	46.8
పెంట్లవెల్లి	42.6
కోడేరు	40
వెల్దండ	31.6
చారకొండ	25.2



తృటిలో తప్పిన ప్రమాదం

బిజినేపల్లి మండల కేంద్రం నుంచి నందివడ్డెమాన్‌ గ్రామానికి వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం వారు నందివడ్డెమాన్‌ గ్రామానికి వెళ్లే క్రమంలో రోడ్డుపై ప్రవహిస్తున్న భీమసముద్రం అలుగు ఉధృతికి ద్విచక్ర వాహనం కొద్ది దూరం కొట్టుకుపోయింది. ఈ క్రమంలో అతి కష్టం మీద నీటి ఉధృతి తక్కువ ఉన్న ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని తిరిగి లాక్కొచ్చారు. తృటిలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజావాణికి గైర్హాజరైతే చర్యలు తప్పవు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌

నాగర్‌కర్నూల్‌: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కా ర్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, గైర్హాజరైతే చర్యలు తప్ప వని కలెక్టర్‌ బాదావత్‌ సంతోష్‌ హెచ్చరించారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని పంపించొద్దని, ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి జి ల్లా అధికారులే స్వయంగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి.అమరేందర్‌, దేవసహాయంతో కలిసి కలెక్టర్‌ బాదావత్‌ సంతోష్‌ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 30 వినతులు అందగా.. వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు కేటాయించారు.

ఐటీఐతో బంగారు భవిష్యత్‌

జిల్లాలోని కల్వకుర్తి, మన్ననూర్‌లో ఉన్న ఐటీఐ (ఏ.టీ.సీ) అడ్వాన్స్‌ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలను పెంచేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్‌ బాదావత్‌ సంతోష్‌ అన్నారు. ఐటీఐలో ఖాళీల భర్తీ కోసం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు అమరేందర్‌, దేవసహాయంతో కలిసి అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు, కల్వకుర్తి పట్టణంలోని ఐటీఐ కళాశాలల్లో 2025–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్వాన్స్‌ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐటీఐలు టెక్నాలజీ హబ్‌లుగా మారిపోయాయని, అత్యాధునిక మౌలిక వసతులు, ప్రపంచ స్థాయి ల్యాబ్‌లు, టాటా టెక్నాలజీస్‌ సహకారం, ప్రముఖ ఇండస్ట్రీల భాగస్వామ్యంతో యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌, డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉండే విద్యార్థులను గుర్తించి, ఐటీఐలో చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా టీజీఏటీఈ వైస్‌ చైర్మన్‌ చంద్రశేఖర్‌గౌడ్‌, జిల్లా కన్వీనర్‌ మన్ననూర్‌ ఐటీఐ ప్రిన్సిపల్‌ ఎస్‌పీ లక్ష్మణ్‌స్వామి, ఐటీఐ కల్వకుర్తి ప్రిన్సిపల్‌ జి.జయమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.రాఘవేంద్రసింగ్‌, జిల్లా కార్మిక శాఖ అధికారి జె.రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు న్యాయ సహాయం అందిస్తాం



మాట్లాడుతున్న జిల్లా సెక్రెటరీ నసీం సుల్తానా

కొల్లాపూర్‌ రూరల్‌: చెంచులకు అన్ని విధాల న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ నాగర్‌కర్నూల్‌ సెక్రెటరీ నసీం సుల్తానా అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అమరగిరి గ్రామాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా చెంచుల యొక్క జీవన స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారికి తమ సంస్థ తరుపున ప్రభుత్వ న్యాయవాదిని నియమించి, న్యాయ సహాయం అందిస్తామన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కొల్లాపూర్‌ పట్టణంలో ఉన్న విశ్వశాంతి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధుల యోగ క్షేమాలను తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవా, మండల న్యాయ సేవా సంస్థ చేదోడు వాడోడుగా ఆశ్రమానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పోతుల నాగరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.



కొండపై నుండి జాలువారుతున్న వర్షపు నీరు

‘ప్రకృతి ఒడిలో పాలధార’

అచ్చంపేట రూరల్‌: ప్రకృతి ఒడిలో అలరారుతున్న శ్రీశైలేషుడి ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరుడి క్షేత్రంలో పాపనాశిని గుండం కొండపై నుంచి జాలు వారే జలపాతం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. కొన్ని రోజులుగా నల్లమల్ల పరిసరాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండచరియల నుంచి వచ్చే జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. చల్లని వర్షపు నీటిలో తడిసి ముద్దవుతున్నారు. అక్కడే సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. ఈ క్రమంలో పైనుంచి కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందని, భక్తులు జాగ్రత్తగా ఉండాలని ఆలయ సిబ్బంది సూచిస్తున్నారు.

జూరాలకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సోమవారం రాత్రి 10 గంటల సమయంలో 2.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 31 క్రస్టు గేట్లు ఎత్తి 2,13,311 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నుంచి 28,734 క్యూసెక్కులు వినియోగించుకుంటున్నారు. ఎత్తిపోతల పథకాలకు నీటిని నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.512 టీఎంసీల నీరు నిల్వ ఉంది. - ధరూర్‌

కోయిల్‌సాగర్‌లో జలసిరి



కోయిల్‌సాగర్‌కు భారీగా వరద వస్తుండడంతో ఐదు గేట్లను అడుగు మేర ఎత్తి.. 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32 అడుగుల వద్ద 2.2 టీఎంసీల నీరు ఉంది. - దేవరకద్ర

సరళాసాగర్‌ కళకళ..



సరళాసాగర్‌ జలాశయానికి సోమవారం ఎగువ నుంచి భారీగా వరద చేరింది. దీంతో 3 వుడ్‌, 2 ప్రైమరీ సైఫన్ల నుంచి 11,350 క్యూసెక్కుల వరద దిగువకు పారినట్లు అధికారులు వివరించారు. శంకర సముద్రం నుంచి భారీగా ఇన్‌ఫ్లో ఉంది. - మదనాపురం

రామన్‌పాడు 3 గేట్లు పైకెత్తి..



సరళాసాగర్‌, శంకరసముద్రం, ఊకచెట్టు వాగు నుంచి రామన్‌పాడు ప్రాజెక్టుకు వరద భారీగా ఉండడంతో సోమవారం 3 గేట్లు పైకెత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఊకచెట్టువాగు ఉధృతి వల్ల పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. - మదనాపురం

సుంకేసులకు వరద..



ఎగువన కురుస్తున్న వర్షాలతో సోమవారం సుంకేసుల జలాశయానికి భారీగా వరద చేరింది. 92 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 17 గేట్లను ఒక మీటర్‌ మేర తెరిచి 87,158 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,180 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ తెలిపారు. - రాజోళి

సంగంబండ.. నిండుకుండ...



మక్తల్‌ మండలం సంగంబండలోని చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌కు ఎగువ కర్ణాటకలోని ఇడ్లూర్‌, నందేపల్లి వాగుల నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో 7 గేట్లు పైకెత్తి 5,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్‌ డీఈ సురేష్‌ తెలిపారు. - మక్తల్‌

చిత్రం.. సజీవ సాక్ష్యం


కల్లు గీస్తున్న గీత కార్మికుడు


మహబూబ్‌నగర్ పరేడ్ మైదానంలో ఉన్న చెట్టుపై తెల్లని కొంగల సమూహం


టైర్లతో ఆడుకుంటున్న పిల్లలు

చరిత్రకు సాక్షిగా.. విజ్ఞానం, వినోదం, ఎన్నో రంగాలలో ఫొటోగ్రఫీని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఫొటోగ్రఫి అనేది ఒక క్షణాన్ని బంధించడమే కాకుండా దాని వెనకున్న భావోద్వేగం, వాతావరణం, అర్థాన్ని సంగ్రహించే కళ. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఛాయాచిత్రం తీసే ప్రతివ్యక్తి తమ అందమైన చిత్రాలను బంధించడం ఒక కళగా భావించి తమ నైపుణ్యాన్ని చాటుకుంటారు. ఈ తీపిగుర్తులు ఎన్నటికీ మరువలేని విధంగా ఉంటాయి. అలాంటి కొన్ని మధుర చిత్రాలు..

– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్


నల్లమల్ల అడవిలోని చెంచు పెంటలో బాలుడు


అద్దంలో ప్రతిబింబం చూసుకుంటున్న కోతి


పాలమూరు యూనివర్సిటీలో చిలుకల ముచ్చట్లు


మంచుపొగలో బతుకు పోరాటం

క్లుప్తంగా

గొంతులో కోడిగుడ్డు ఇరుక్కొని వ్యక్తి మృతి


ఈశ్వరయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాలలో గొంతులో గుడ్డు ఇరుక్కుని వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వింజమూరి ఈశ్వరయ్య (52) ఆదివారం రాత్రి భోజనం చేసే సమయంలో గుడ్డు తిన్నాడు. అందులోని పచ్చసోన గొంతులో ఇరుక్కుపోవడంతో భార్య ఈశ్వరమ్మ తలపై కొట్టి గుడ్డును కక్కించే ప్రయత్నం చేయడంతో పాటు నీళ్లు తాపినా ప్రయోజనం లేక అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా.. ఈశ్వరయ్యను ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని చెప్పడంతో చేసేదేమి లేక ఇంటికి తీసుకెళ్లి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. మహిళ దుర్మరణం


లక్ష్మి మృతదేహం

కోస్గి: బస్సు దిగుతుండగా డ్రైవర్ అజాగ్రత్తగా ముందుకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు కింద పడి మహిళ మృతి చెందిన ఘటన గుండుమాల్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. గుండుమాల్‌కు చెందిన బోడ లక్ష్మి (45) పుట్టింటికొచ్చిన తన కుమార్తె కృష్ణమ్మను అత్తగారి ఊరికి పంపించేందుకు బస్సులో కోస్గికి వచ్చింది. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామానికి రావడానికి కోస్గి నుంచి నారాయణపేట వెళ్తున్న బస్సు ఎక్కింది. ఈ క్రమంలో గుండుమాల్ శివారులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దిగేందుకు బస్సు ఆపింది. లక్ష్మి బస్సు దిగుతుండగానే గమనించకుండా డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లడంతో వెనుక టైర్లు ఆమె కాళ్ల పైనుంచి వెళ్లాయి. ప్రయాణికులు అరవడంతో బస్సు ఆగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను 108లో కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ అనంతరం డ్రైవర్‌తో పాటు బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై మృతురాలి భర్త చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి హఠాన్మరణం

పాన్‌గల్: కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని కేతేపల్లికి చెందిన తోకల కృష్ణ పబ్లిసిటీ పెయింటింగ్ కాంట్రాక్టర్. ఆయన దగ్గర ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి చెందిన జానీ రంగరావు, సదరం రమణ (58) పెయింటర్స్‌గా పని చేస్తున్నారు. ఏపీలోని అనంతపూర్‌లో పెయింటింగ్ పని ముగించుకొని ఈ నెల 16న రాత్రి కేతేపల్లికి చేరుకున్నారు. 18వ తేదీన సదరం రమణ బహిర్భూమికి వెళ్తూ గ్రామపంచాయతీ కార్యాలయ భవనం దగ్గర కళ్లు తిరిగి కిందపడిపోయాడు. వెంటనే గ్రామంలోని ఆర్‌ఎంపీ దగ్గరకు అటు నుంచి జిల్లా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తోకల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నారాయణపేట క్రైం: వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లిన ఓ వ్యక్తి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో బైక్ ఢీకొని మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పట్టణానికి చెందిన వర్కూర్ శ్రీనివాసులు ఆదివారం రాత్రి బీడీలు తెచ్చుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి నడుచుకుంటూ వెళ్తుండగా కాళికామాత ఆలయం సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని పట్టణ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మహబూబ్‌నగర్, అక్క డి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా.. మార్గ మధ్యంలో మృతి చెందినట్లు కుమారుడు పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా జములమ్మ ఎదుర్కోళ్ల ఉత్సవం


ఎదుర్కోళ్ల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

- భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపు
- నేడు అమ్మవారి కల్యాణోత్సవం

గద్వాలటౌన్: నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం చేపట్టిన ఎదుర్కోళ్ల ఉత్సవం వైభవంగా సాగింది. జములమ్మ అమ్మవారిని పెళ్లి కుమార్తెను చేయగా.. అంతకుముందు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం గణపతిపూజ చేశారు. జమ్మిచేడు శివాలయం నుంచి ఎదుర్కోళ్లను ప్రారంభించి కళాకారులతో గంగతెప్ప, పుట్ట బంగారాన్ని అర్చకులు, ధర్మకర్తలు ఆలయానికి తీసుకొచ్చారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుంచారు. పోతరాజుల నృత్యాలు, విన్యాసాలతో సందడి నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, ఈఓ పురేందర్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


ఆలయ ముఖద్వారం ఎదుట ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం

అమ్మవారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఏటా శ్రావణ మాసంలో చివరి మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించే జమ్ములమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకను కనులపండువగా నిర్వహించేలా ఆలయ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే పలుమార్లు దేవస్థానం పాలకమండలి సభ్యులు అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు. భారీ కల్యాణ వేదిక ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని అధికారుల అంచనాకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఉదయం 12:15 గంటలకు జరిగే కల్యాణోత్సవానికి ముందు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురానున్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ తోపాటు జిల్లాలోని ముఖ్యమైన నాయకులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

12యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్/ధరూర్: జూరాలకు ఎగువ నుంచి వరదనీరు భారీగా చేరుతుండడంతో ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. సోమవారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 241.206 ఎంయూ, దిగువలో 6యూనిట్ల ద్వారా 240మెగావాట్లు, 281.762 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 522.968 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు మళ్లీ ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 87,139 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు లక్షా20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు లక్షా35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువనున్న జూరాలకు 3గేట్లను ఎత్తి లక్షా 40వేల 890 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

రేపు కురుమూర్తి ఉత్సవాల బహిరంగ వేలం

చిన్నచింతకుంట: అమమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద 2025–26 సంవత్సరం బ్రహోత్సవాలను పురస్కరించుకొని వివిధ రకాల వ్యాపారాలు కొనసాగించుకునేందుకు బుధవారం 10:30గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి తెలిపారు. ముఖ్యంగా కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, పూజాసామగ్రి విక్రయించడం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు సేకరించుట, లైటింగ్ వసతి, రంగుల రాట్నాల ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తిగలవారు కొబ్బరికాయలు, లడ్డూ పులిహోర, తలనీలాలు సేకరించుటకు రూ.5లక్షలు, పూజాసామగ్రి, టెంకాయ చిప్పలు, లైటింగ్ వసతికి, రంగులరాట్నంకు రూ.2లక్షలు డిపాటిట్ చేయాల్సి ఉంటుందన్నారు. చిన్నచింతకుంట యూనియన్ బ్యాంకులో కురుమూర్తి స్వామి దేవస్థానం పేరుమీద డీడీ తీసి వేలం పాటకు గంటముందు డీడీతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయలని సూచించారు. వేలంపాట ముగిసిన ఐదురోజుల్లో హెచ్చు పాటదారుడు డిపాజిట్‌తో కలిపి మొత్తం వందశాతం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేకుంటే డిపాజిట్‌ను జప్తు చేసి వేలంపాటను రద్దు చేయడం జరుగుతుందన్నారు. మళ్లీ వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టెండర్ల కాలపరిమితి

కురుమూర్తి స్వామి ఆలయం వద్ద వ్యాపారాలకు నిర్వహించనున్న ఈ సంవత్సరం టెండర్లకు కాలపరిమితి కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, పూలు, పూల దండలు, పూజాసామగ్రి, వాహనపూజ సామగ్రికి 01.10.2025 నుంచి 30.09.2026 వరకు, తలనీలాలు సేకరించుట, టెంకాయల చిప్పలు సేకరణ, విద్యుత్ లైటింగ్ వసతి కల్పించుట, రంగుల రాట్నాం ఎగ్జిబిషన్ ఏర్పాటుకు 21.10. 2025నుంచి 20.11.2025 వరకు కాలపరిమితి ఉంటున్నట్లు అధికారులు వివరించారు.

పారహక్కుల నేతకు కత్తిపోట్లు


చికిత్స పొందుతున్న పౌరహక్కుల నేత మహేశ్

మల్దకల్: మండలంలోని ఎల్కూర్‌కు చెందిన పౌరహక్కుల నేత కత్తిపోట్లకు గురయ్యాడు. వివరాలిలా.. ఎల్కూరుకు చెందిన పౌరహక్కుల నేత దళిత మహేశ్ గ్రామంలోని ఓ హోటల్ వద్ద సోమవారం సాయంత్రం టీ తాగుతుండగా.. అదే గ్రామానికి చెందిన నీలి బీసన్న, నీలి పాండు కత్తులతో పొడిచి గాయపరచ్చారు. సమీప బంధువులు అక్కడి చేరకోవడంతో కత్తితో పొడిచినవారు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన మహేశ్‌ను హుటాహుటిన గద్వాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ దాడికి భూ వివాదాలే కారణమని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, పౌరహక్కుల సంఘం నేతలు ఆస్పత్రికి చేరుకుని మహేశ్‌ను పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి


సంకటి సుశాంత్ (ఫైల్)

పాన్‌గల్: చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని బుసిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన సంకటి మాధవి ఈనెల 11వ తేదీన ఇంట్లో పొయ్యిపై అన్నం వండుతుండగా.. కుమారుడు సుశాంత్(6) పొయ్యిపై ఉన్న గిన్నెలో టీ అనుకొని తీసే క్రమంలో వేడివేడి అన్నం, గంజి పడడంతో కడుపు, ఎడమవైపు, పక్కటెముకలు కాలి గాయాలయ్యాయి. వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. నీలోఫర్‌లో వారంపాటు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. చిన్నారి మృతిలో ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి తండ్రి బాల్‌రాజు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడు ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శభాష్.. వెంకటేశ్

- చెరువు మధ్యలో స్తంభమెక్కి మరమ్మతు
- మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- యువకుడికి సోషల్ మీడియాలో అభినందనల వెల్లువ

కోస్గి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్న క్రమంలో చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంపై వైరు తెగిపోయి తన పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఈదుకుంటూ వెళ్లి వైర్లు సరిచేసి సరఫరా పునరుద్ధరించి శభాష్ అనిపించుకున్నాడు యువకుడు వెంకటేశ్. సంబంధిత గ్రామాలకు కొన్నేళ్లుగా విద్యుత్ శాఖ నుంచి అధికారికంగా లైన్‌మెన్ లేకపోయినా కరెంట్ బిల్లుల వసూలుకు నియమించబడిన సదరు యువకుడు తన పని కాకపోయినా ధైర్యం చేసి విద్యుత్ మరమ్మతులు చేశాడు. ముశ్రీఫా, ముంగిమళ్ల, ముక్తిపాడ్‌కు సంబంధించిన కరెంట్ బిల్లుల వసూలుకు స్పాట్‌బిల్లర్‌గా కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ముశ్రీఫా శివారులో ఉన్న చెరువు మధ్యలో విద్యుత్ వైరు తెగిపోయింది. దీంతో ముశ్రీఫా, ముంగిమళ్ల, ముక్తిపాడ్‌కు విద్యుత్ సరఫరా నిలిచి గ్రామాల్లో చీకటి అలుముకుంది. సోమవారం ఉదయం విద్యుత్ లైన్‌ను పరిశీలించగా.. చెరువు మధ్యలో వైరు తెగినట్లు గుర్తించారు. స్పాట్‌బిల్లర్ వెంకటేశ్ ఎల్‌సీ తీసుకొని చెరువులో ఈదుకుంటూ వెళ్లి మధ్యలో ఉన్న స్తంభం ఎక్కి వైర్లు సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాడు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వెంకటేశ్‌ను అభినందించారు. ప్రమాదకరమని తెలిసినప్పటికీ ధైర్యం చేసి చెరువు మధ్యలోకి వెళ్లి మరమ్మతు పనులు పూర్తి చేసిన వీడియోలు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో వెంకటేశ్‌కు సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.


వెంకటేశ్


స్తంభంపై విద్యుత్ వైర్లు సరిచేస్తూ..

పనుల బాధ్యత మీది.. నిధుల బాధ్యత నాది


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో సమీక్ష

జడ్చర్ల: నియోజకవర్గంలో భారీ వర్షాల పట్ల సంబంధిత శాఖల అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏఏ పనులు చేస్తారో ఆ బాధ్యత మీది.. అందుకు నిధులు తీసుకొచ్చే బాధ్యత నాదని ఎమ్మెల్యే అనిరధ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నీటిపారుదల, విద్యుత్, మున్సిపల్, వ్యవసాయ, రెవెన్యూ, ప్రజారోగ్య శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అధిక వర్షాలు, ఇబ్బందులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువులు, వాగులు, ప్రవాహాల ఉధృతి తీవ్రంగా ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్తగా చెరువులను సందర్శించి బలహీనపడిన కట్టలను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. చెరువు కట్టల పటిష్టతపై సర్వేచేసి ప్రమాదం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణ పనులు చేపట్టేందుకు రూ.11కోట్లతో సేఫ్టీ బడ్జెట్‌ను ఇప్పటికే ప్రభుత్వానికి పంపామని సంబంధిత అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వెంటనే ఆయన సీఎండీకి ఫోన్ చేసి విషయం చెప్పగా.. సానుకూలంగా స్పందించారు. జడ్చర్లలో నల్లకుంట, నల్లచెరువు, ఊరచెరువుకు సంబంధించిన వరద నీరు ప్రవహించే ఫీడర్ ఛానల్స్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షం నీరు రోడ్లపైకి రాకుండా, వరదల కారణంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా మరో 20ఏండ్ల వరకు సరిపోయే విధంగా ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఎక్కడైనా ఎవరైనా వెంచర్లు తదితర ప్లాటింగ్ చేస్తే నిర్మొహమాటంగా తొలగించాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను అంచనా వేయాలని, రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. నియోజకవర్గం స్థాయిలో అన్ని శాఖల అధికారులకు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి అందులో సమస్యలపై స్పందించే విధంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వంతెన నిర్మించాలని వినతి

పోలేపల్లి–కిష్టారం మధ్య పోలేపల్లి చెరువు అలుగు పారుతుండడంతో రాకపోకలు నలిచిపోయాయని వెంటనే అక్కడ వంతెన నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే అంబటాపూర్–కిష్టారం మధ్య బీటీరోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. రాజాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 284లో ఇచ్చిన ఎన్‌ఓసీ రద్దు చేసి నాగులకుంటను పునరుద్ధరించాలని, చెరువును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త వెంకటయ్య ఫిర్యాదు చేశాడు.

బిజినేపల్లిలో భారీ చోరీ

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన శ్యాసని శివప్రసాద్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శివప్రసాద్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లారు. గమనించిన దుండగులు రాత్రి వేళ ఇంట్లోకి చొరబడి దాదాపు రూ.15లక్షల నగదు, 5నుంచి 6తులాల బంగారం నగలు దోచుకెళ్లినట్లు తెలిసింది. స్థానికులు గమనించి సోమవారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకు ని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులు ఇంటి వద్ద లేకపోవడంతో తమకు ఎలాంటి ఫిర్యా దు అందలేదని పోలీసులు తెలిపారు.